ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

బుధవారం 21 ఫిబ్రవరి 2024

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 20: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి జరిగి మూడు రోజులు గడిచింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాలు, విపక్షాలు, విద్యార్థి, జర్నలిస్టు సంఘాలు ఆందోళనకు దిగాయి. తీవ్ర గాయాలతో హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకృష్ణ నుంచి పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. క్రైం నంబర్ 22/2024 కింద రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇప్పటి దాకా ముగ్గురిని గుర్తించి, హత్యాయత్నం కేసు నమోదు చేశామని పోలీసులు అంటున్నారు.



భయం లేదు.. బరితెగింపే..

శ్రీకృష్ణపై దాడిచేసినవారి దర్జా

ముగ్గురిపై హత్యాయత్నం కేసు



మిగిలిన వారిని గుర్తిస్తామంటున్న పోలీసులు

రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో ఎర్రిస్వామి దర్పం

ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉంటూ.. బండి రవి సవాల్

ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసినవారి తీరిది





కూడేరు మండలం మరుట్ల-2 కాలనీకి చెందిన ఎర్రిస్వామి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ దొడఘట్ట గ్రామానికి చెందిన అశోక్, కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి చెందిన బండి రవిపై ఐపీసీ 147, 148, 324, 427, 307 రెడ్ విత్ 149 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మిగిలినవారిని గుర్తించే పనిలో ఉన్నామని రాప్తాడు సీఐ మునిస్వామి తెలిపారు.

● కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి పోలీసులు వెళ్లారు. బండి రవి కోసం ఆరా తీశారు. ఇంటి వద్ద లేకపోవడంతో అతనికి ఫోన్ చేశారు. **'అనంతపురంలో రాప్తాడు ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉన్నా.. కావాలంటే లొకేషన్ పెడతా..!'** అన్నాడు. దమ్ముంటే పట్టుకోండి చూద్దాం.. అన్నట్లు..!



● **'కింద పడేసి కొట్టి వచ్చినా.. నన్ను ఎవరూ ఏమీ చేసుకోలేరు..'** ఇది కళ్యాణదుర్గం మండలం బోయలపల్లికి చెందిన నాగేంద్ర ఆ ఊరి జనంతో అంటున్న మాట..! ఇతను దాడి చేసినవారిలో ఉన్నట్లు ఆ ఊరి జనం గుర్తించారు. తానూ దాడి చేశానని దర్జాగా చెప్పుకుంటున్నాడు. మంత్రి ఉష శ్రీచరణ్ అనుచరుడిని అన్న ధీమా కావచ్చు..!

దాడి చేసిన తీరు ఉన్మాదానికి పరాకాష్ఠ..! ఇప్పుడు పోలీసులకు విసురుతున్న సవాలు.. బరితెగింపునకు పరాకాష్ఠ..!

ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు..! జర్నలిస్టులకు అది విధి.. బాధ్యత..! అధికారంలో ఉన్నవారు హక్కులను కాపాడాలి. కానీ విస్మరించి.. విచక్షణ కోల్పోయి.. దాడులకు పురిగొల్పేలా స్పందిస్సున్నారు.

స్టేషన్ వద్ద 'విశ్వ' మూక



మిద్దె ఎర్రిస్వామిని అతని స్వగ్రామంలోనే పోలీసులు అదుపులోకి తీసుకుని.. రాప్తాడు స్టేషన్‌కు తరలించారు. ఆ వెంటనే మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అనుచరులు రాప్తాడు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. విశ్వ ఫొటో స్టిక్కర్ అంటించిన బ్లాక్ స్కార్పియోలో వచ్చి.. రాత్రి వరకూ స్టేషన్ వద్దనే గడిపారు. ఎర్రిస్వామిని స్టేషన్ నుంచి తీసుకెళ్లేందుకు 'విశ్వ'ప్రయత్నాలు చేశారు. పోలీసు అధికారులపై తీవ్ర ఒత్తిడి చేశారు.



అత్తారింటికి వచ్చినట్లు..

కూడేరు మండలం మరుట్ల 2వ కాలనీకి చెందిన మిద్దె ఎర్రిస్వామిని రాప్తాడు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. జీపులో ఎక్కించుకుని స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఇస్త్రీ బట్టలు ధరించి, చేతిలో మినరల్ వాటర్ బాటిల్ పట్టుకుని.. ఆఫీసర్ దిగినట్లుగా జీపు నుంచి దిగాడు. బాటిల్‌లో మిగిలిన నీటిని గటగటా తాగేశాడు. ఖాళీ బాటిల్ చేతబట్టుకుని.. స్టేషన్ మెట్లు ఎక్కుతూ, ఆ బాటిల్‌ను పక్కన పడేశాడు. లోపలికి వెళ్లి దర్జాగా విజిటర్స్ కుర్చీలో కూర్చున్నాడు. ఈ సీన్ చూసేవారు ఎవరైనా.. ఎవరో ఆఫీసర్ స్టేషన్ విజిట్‌కు వచ్చాడు అనుకుంటారేగాని, హత్యాయత్నం కేసు నిందితుడిని స్టేషన్‌కు పట్టుకువచ్చారని ఎవ్వరూ అనుకోరు.

జర్నలిస్టులపై దాడులను ఆపండి

శ్రీకృష్ణపై దాడిచేసినవారిని అరెస్టు చేయండి

జర్నలిస్టు, ప్రజా సంఘాలు, విపక్షాల డిమాండ్

జిల్లా వ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు



కళ్యాణదుర్గం : అంబేడ్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 20: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని ఖండిస్తూ చెన్నేకొత్తపల్లిలో జర్నలిస్టులు నిరసనతో హోరెత్తించారు. టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. మొదట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి జర్నలిస్టులు పూలమాల వేసి, వినతిపత్రాన్ని అందజేశారు. అక్కడి నుంచి వివిధ పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా బస్టాండ్ సర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడ మానవహారంగా ఏర్పడి జర్నలిస్టులపై దాడులను ఆపాలని నినాదాలు చేశారు. శ్రీకృష్ణపై దాడి చేసినవారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ట్రైనీ డీఎస్పీ పృథ్వీకి వినతి పత్రం అందజేశారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు దేవేంద్రరెడ్డి, ప్రసాద్, నరేశ్, శ్రీనివాసులు, వెంకటేశ్, ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, మల్లికార్జున, మహానందరెడ్డి, నాగేంద్ర, గణేశ్, నారాయణస్వామి, వెంకటరెడ్డి, వేణు, పుల్లన్న, షమీవుల్లా, అర్జున్, టీడీపీ నాయకులు ముత్యాల్ రెడ్డి, దండు ఓబులేసు, రామసుబ్బమ్మ, అంకె అమరేంద్ర, ఎజ్జే శంకర్, ముత్యాలప్ప, బెస్తనాగార్జున, రామకృష్ణారెడ్డి, మాడెం సూర్యనారాయణరెడ్డి, రామాంజినేయులు, గేటు కిష్టప్ప, రామాంజి, శివ, కోళ్లసూరి, చెన్నకేశవులగౌడ్, నీలకంఠారెడ్డి, నరేంద్రరెడ్డి, బండారు భార్గవ, భాస్కర్, ఓబిరెడ్డి, సూరి, కాసశివారెడ్డి, ఆదెప్ప, చంద్రాయుడు, నరసింహులు, ఐ-టీడీపీ నాయకుడు పవన్, జనసేన మండల కన్వీనర్ ఇటికోటి క్రాంతికుమార్, బీజేపీ నాయకులు జిలకర ఆంజనేయులు, సీపీఎం నాయకుడు లింగన్న, ఎమ్మార్పీఎస్ నాయకుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.





సీకేపల్లి: బస్టాండ్ కూడలిలో మానవహారం.. ప్లకార్డులతో ర్యాలీగా వెళ్తున్న పాత్రికేయులు, టీడీపీ, జనసేన.బీజేపీ, సీపీఎం నాయకులు..

దాడి అమానుషం: కాంగ్రెస్

కళ్యాణదుర్గం రూరల్: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి అమానుషమని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాంభూపాల్ రెడ్డి అన్నారు. కళ్యాణదుర్గంలోని బళ్లారి మిట్టమీద నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టుకుని వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులను ఏ ఒక్కరూ హర్షించరని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఫోర్త్ స్టేట్‌గా పిలువబడే మీడియాపై వైసీపీ మూకలు దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. శ్రీకృష్ణను హత్య చేయడానికీ వెనుకాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడ్డవారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి కేసులో ఒకరి అరెస్ట్

అనంతపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి ఘటనలో కూడేరు మండలం మరుట్ల-2 కాలనీకి చెందిన మిద్దె ఎర్రిస్వామిని మంగళవారం అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇతడిపై హత్యాయత్నం(307ఐపీసీ) కేసు నమోదు చేశామన్నారు. శ్రీకృష్ణపై జరిగిన దాడి ఘటనలో ఇప్పటికే కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి, దాడి చేసిన వారిని గుర్తించే పనిలో ఉన్నామన్నారు. ఈ దాడి ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, ఇప్పటికే ఆరుగుర్ని గుర్తించినట్లు వివరించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. దాడికి పాల్పడిన వారిపై తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం అరెస్టు చేసిన మిద్దె ఎర్రిస్వామిని బుధవారం కోర్టు ఎదుట హాజరు పరుస్తామన్నారు.



ఆరుగుర్ని గుర్తించాం.. గాలిస్తున్నాం

ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

శ్రీకృష్ణపై దాడి అమానవీయం

పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్

రాయదుర్గం, ఫిబ్రవరి 20: ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి చేయడం అమానవీయమని, కిరాతకమని పీసీసీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. రాయదుర్గంలోని సమైఖ్యాంధ్ర భవనంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, హింసను ప్రేరేపించేవారికి కూడా స్థానం లేదని ఆయన అన్నారు. దాడికి ప్రోత్సహించిన వారిని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న శైలజానాథ్

నాలుగు రోజుల్లో అభ్యర్థుల ప్రకటన

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి, ఫిబ్రవరి 20: బీజేపీతో పొత్తు ఖరారయ్యే అవకాశం ఉన్నందుకే టీడీపీ అభ్యర్థుల ప్రకటనలో జాప్యం జరుగుతోందని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పెద్దపప్పూరులో బస్సుయాత్ర ముగింపు సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మూడునాలుగు రోజుల్లో పొత్తు ఖరారౌతుందని, అభ్యర్థుల ప్రకటన కూడా జరగవచ్చునని అన్నారు. పొత్తు ధర్మంలో భాగంగా ఎవరిసీటు అయినా త్యాగం చేయాల్సిన పరిస్థితులు ఉంటాయని అన్నారు. తాడిపత్రి వేరే వారికి కేటాయించినా తాము వదులుకుని, పార్టీకోసం పనిచేయక తప్పదని అన్నారు. వైసీపీలో ఇప్పటివరకు ఎవరికీ సీట్లు ఖరారు కాలేదని అన్నారు. ఇన్‌చార్జిల పేరుతో ఒక నియోజకవర్గం నుంచి మరొక నియోజకవర్గానికి మార్పులు చేర్పులు చేస్తున్నారని అన్నారు. సిద్ధం సభ రౌడీ సభ అని విమర్శించారు. జర్నలిస్టులపై దాడిచేస్తే ఎలాంటి స్పందన వస్తుందోనని ట్రయల్ వేసి, ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ అల్లరిమూకలు దాడులకు దిగాయని ఆయన అన్నారు. మండలాల్లో బస్సు యాత్ర చేస్తే తనకు 30 వేల వరకు జనాలు వచ్చారని, వైసీపీ సిద్ధం సభకు 52 నియోజకవర్గాల నుంచి కేవలం 2.5 లక్షల మంది వచ్చారని అన్నారు. వైసీపీ చెబుతున్నట్లు 10 లక్షల జనాభా రాలేదని అన్నారు.



మా కుటుంబంలో ఎవరో ఒకరు పోటీచేస్తారు: జేసీ అశ్మిత్‌రెడ్డి

జేసీ కుటుంబం నుంచి ఎవరో ఒకరు పోటీచేస్తారని టీడీపీ తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. బస్సుయాత్ర ముగింపు సభలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు సీటు ఇచ్చినా ఇవ్వకపోయినా తమ కుటుంబం నుంచి ఎవరో ఒకరు బరిలో ఉంటారని అన్నారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా ఏదో ఒక అవకాశం ఇచ్చినా, రెండూ ఇచ్చినా గెలుపుకోసం కృషి చేస్తామని అన్నారు. తాము సీట్ల కోసం ఎవరినీ అడగడం లేదని, అదంతా అధిష్టానం చూసుకుంటుందని అన్నారు.

విజయవంతం చేయండి

ఏపీయూడబ్ల్యూజే

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 20: ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని నిరసిస్తూ జర్నలిస్టు సంఘాలు చేపట్టిన చలో అనంతపురం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగదీష్, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డేనియల్ విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. ఈ నెల 22న అనంతపురం నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని ప్రజాస్వామ్యవాదులందరూ మద్దతుగా నిలవాలని కోరారు. శ్రీకృష్ణపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు.

బటన్ కాదు.. పీక నొక్కుతాం..!

మా దగ్గర రెండు బటన్‌లున్నాయి

సమస్యలను పరిష్కరించకపోతే వాడుతాం

ప్రభుత్వానికి ఏపీ జేఏసీ నేతల హెచ్చరిక



పవర్ ఆఫీస్ నుంచి ర్యాలీగా వస్తున్న ఏపీజేఏసీ నేతలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 20: 'మా సమస్యలను పరిష్కరించకపోతే మీరు బటన్‌లు నొక్కడం కాదు.. మేమే మీ పీక నొక్కుతాం' అని ఏపీ జేఏసీ నాయకులు సీఎం జగన్‌ను హెచ్చరించారు. ఐదేళ్లలో సంక్షేమ పథకాలకు నిధుల మళ్లింపు బటన్‌లు నొక్కడం తప్ప.. ఉద్యోగులకు చేసిందేమీ లేదని విమర్శించారు. అలవెన్సులు ఇవ్వమంటే పెండింగ్‌లో పెట్టి పథకాలకు నిధులు మళ్లించారని మండిపడ్డారు. ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు మునుపు పవర్ ఆఫీస్ నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా చేశారు. ఐదేళ్లుగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా పెడచెవిన పెట్టిందని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కటంటే ఒక్క డిమాండ్‌ను కూడా పరిష్కరించకుండా ఉద్యోగులను మానసిక క్షోభకు గురిచేసిందని అన్నారు. పలు దఫాలు చర్చలకు పిలిచి, అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎన్నిసార్లు ధర్నాలు చేయాలి..? ఎంకెన్ని రోజులు రోడ్లమీద పడాలి..? మా ఓపికను పరీక్షిస్తే జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది' అని హెచ్చరించారు. తాము దాచుకున్న జీపీఎఫ్, అలవెన్సుల సొమ్మును ఇవ్వమంటే ఆంక్షల పేరుతో పెండింగ్‌లో ఉంచడం బాధాకరమని అన్నారు. ఎన్నికలకు ముందు అలవిగాని హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల గొంతు కోశారని జగన్‌పై మండిపడ్డారు.

● ప్రభుత్వం చేతగానితనంవల్లే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడిందని ఏపీ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ అన్నారు. అలివిగాని హామీలను ఇవ్వమని తాము అడిగామా అని ప్రశ్నించారు. అధికారంలో రాకముందు ఒకమాట, వచ్చాక మరో మాట మాట్లడటం తగదని అన్నారు. సీఎం జగన్ మాట తప్పడంతో పాటు.. మడమ తిప్పేశారని అన్నారు.

● 11వ పీఆర్సీ బకాయిలను ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేయడం దారుణమని ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రెడ్డి అన్నారు. 12వ పీఆర్సీపై కమిటీ వేసినా, అది అమలు కావడం లేదని అన్నారు. 12వ పీఆర్సీ అమలయ్యేలోపు... 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏ ఒక్క సమస్య పరిష్కరించకపోయినా... ఉద్యమం ఉధృతమవుతుందని హెచ్చరించారు. ఈ నెల 27న నిర్వహించే చలో విజయాడ పక్కాగా జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం అడ్డుకోవాలని చూసినా ఆగదని అన్నారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉద్యోగులు హాజరై తమ సత్తా చూపిస్తామని అన్నారు.

● కార్యక్రమంలో ఏపీఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల మాధవ, జిల్లా కన్వీనర్ చంద్రమోహన్, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమయ్య, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు, పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా కిశోర్‌చౌదరి, ఎల్ఎస్ఏ మాజీ అధ్యక్షుడు మల్లికార్జున, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూరీడు, జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ఫ్యాప్టో చైర్మన్ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ నిబంధనలు తుంగలోకి..

నిబంధనలు బేఖాతర్

ఇష్టానుసారంగా పార్సిల్ విక్రయాలు

అటకెక్కిన సమయపాలన

అర్ధరాత్రి దాటినా యథేచ్ఛగా అమ్మకాలు


క్వార్టర్‌పై రూ.100 అదనంగా వసూలు

పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 20: జిల్లాలోని పలు బార్ అండ్ రెస్టారెంట్లల్లో దందా ఆగడం లేదు. కొన్ని బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు యథేచ్ఛగా నిబంధనలు అతిక్రమిస్తున్నా పట్టించుకునే వారే లేరు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్, విజిలెన్స్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు అధికారులు నెలవారి మామూళ్లు తీసుకొని, నిబంధనల అతిక్రమణలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఇష్టానుసారంగా పార్సిల్ విక్రయాలు

ప్రభుత్వ నిబంధనల మేరకు బార్లల్లో కొనుగోలు చేసిన మద్యాన్ని అక్కడే సేవించాలి. మద్యం బాటిల్స్‌ను పార్సిల్ ఇవ్వకూడదు. అయితే అందుకు విరుద్ధంగా బయటకు మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు తెలిసింది. కొన్ని నెలల కిందట ఎక్సైజ్ ఉన్నతాధికారులు కర్నూలు నుంచి ప్రత్యేక ఎక్సైజ్ అధికారుల బృందాన్ని అనంతపురంలోని బార్లలో తనిఖీలకు పంపారు. నగరంలోని ఓ బార్‌లో తనిఖీలకు వెళ్లిన ప్రత్యేక బృందం ఎదుటే మద్యాన్ని పార్సిల్ ఇవ్వడంతో అధికారులు నిలదీశారు. అక్కడే ఉన్న బార్ నిర్వాహకుడు, ముగ్గురు సిబ్బంది అప్పట్లో బృందం అధికారులపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. మద్యం పార్సిల్ విక్రయాలు చేసినందుకు అధికారులు విధించిన జరిమానా సొమ్మును యజమాని చెల్లించడంతో అప్పట్లోనే తిరిగి బార్ అండ్ రెస్టారెంట్‌ను ఓపెన్ చేశారు. అధికారులపై దాడి ఘటనకు సంబంధించిన కేసు ప్రస్తుతం కోర్టులో నడుస్తోంది.



అటకెక్కిన సమయపాలన

జిల్లా వ్యాప్తంగా 19 బార్ అండ్ రెస్టారెంట్లు నడుస్తున్నాయి. అనంతపురం నగరంలో 10 బార్లు, తాడిపత్రిలో 3, గుంతకల్లులో 3, గుత్తిలో 1, కళ్యాణదుర్గంలో 1, రాయదుర్గం 1 బార్ అండ్ రెస్టారెంట్లు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల దాకా మాత్రమే మద్యం విక్రయాలు జరపాలి. ఉదయం 10కి ముందు, రాత్రి 11 తర్వాత మద్యం విక్రయాలు చేయకూడదు. రాత్రి 11 నుంచి 12 దాకా కేవలం ఆహారం సరఫరాకు అనుమతి ఉంది. కొన్ని బార్ల నిర్వాహకులు ఈ నిబంధనలకు అటకెక్కించారు. అనంతపురంలోని కొన్ని బార్లతోపాటు జిల్లాలోని మరికొన్ని బార్లల్లో ప్రతి రోజు తెల్లవారుజామున 5 గంటలకే మద్యం విక్రయాలు మొదలుపెడుతున్నట్లు సమాచారం. మరికొన్ని బార్లల్లో ఉదయం 8 నుంచి 9 గంటలకే మద్యం విక్రయాలు మొదలుపెడుతున్నట్లు తెలిసింది. అలాగే రాత్రి 11 గంటలు దాటినా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. కొన్ని బార్లల్లో అర్ధరాత్రి దాటినా మద్యం విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నట్లు విమర్శలున్నాయి.

క్వార్టర్‌పై రూ.100 అదనంగా వసూలు

గతేడాది జూలై మాసంలో మూడేళ్ల కాలపరిమితితో బార్ల నిర్వహణకు టెండర్లు ఖరారు చేశారు. కొందరు అధిక ధరకు బార్లను దక్కించుకున్నారు. అనంతపురంపరిధిలో ఒక సంవత్సరం బార్ నిర్వహణ కోసం రూ.95 లక్షల నుంచి రూ.1.66 కోట్లకుపైగా టెండర్‌లో దక్కించుకున్నారు. తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, గుత్తి, రాయదుర్గం ప్రాంతాల్లో రూ.33 లక్షల నుంచి రూ.73లక్షల దాకా టెండర్లల్లో పాడి బార్లను దక్కించుకున్నారు. టెండర్లల్లో ఎక్కువ మొత్తానికి దక్కించుకున్న కొన్ని బార్ల నిర్వాహకులు అదే స్థాయిలో ఆదాయం పొందేందుకు నిబంధనల అతిక్రమణలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని ఎమ్మార్పీ కంటే 10 శాతం అదనపు ధరతో బార్లకు మద్యం బాటిళ్లను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. కానీ బార్లలో ఈ ధరకు మద్యం విక్రయించడం లేదు. వారికి ఇష్టమొచ్చినట్లు ధరలు నిర్ణయించి విక్రయిస్తున్నారు. కొన్ని బార్లల్లో క్వార్టర్ బాటిల్‌పై రూ.100 నుంచి రూ.110 అదనంగా వసూలు చేస్తున్నారు. మరికొన్ని బార్లల్లో క్వార్టర్‌పై రూ.60 నుంచి రూ.80లు అదనంగా వసూలు చేస్తున్నారు. బీర్లపై రూ.70 నుంచి రూ.100లు అదనంగా వసూలు చేస్తుండటం గమనార్హం. కొన్ని బార్లల్లో రాత్రి 10 గంటలు దాకా ఒక రేటు, ఆ పైన మరో ధరతో మద్యం విక్రయాలు జరుపుతున్నారు. ఏడాదికి లైసెన్స్ ఫీజు రూపంలో లక్షలాది రూపాయలు ప్రభుత్వానికి చెల్లించే తాము అధిక ధరలకు విక్రయిస్తే తప్పేముందన్న ధోరణిలో బార్ల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు.

వైసీపీ నాయకుల బాహాబాహీ

కొట్టుకుని చొక్కాలు చింపుకున్న బ్రహ్మసముద్రం నాయకులు



బ్రహ్మసముద్రంలో గొడవ జరిగిన ప్రాంతంలో గుంపుగా చేరిన జనం

కణేకల్లు, ఫిబ్రవరి 20: మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామం వైసీపీలోని రెండు వర్గాలు మంగళవారం బాహాబాహీకి దిగాయి. ఒకరినొకరు కొట్టుకుని చొక్కాలు చింపుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ సంఘటన పార్టీలోని అంతర్గత విభేదాలను తేటతెల్లం చేస్తోంది. గ్రామంలో వైసీపీలో సురేష్‌రెడ్డి, కిషోర్ వర్గాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథరెడ్డి మంగళ వారం బ్రహ్మసముద్రంలో 'ఇంటింటికి మెట్టు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని సురేష్‌రెడ్డితో పాటు కిషోర్ వర్గీయులు పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన రహదారిలో మెట్టు విశ్వనాథ్ ప్రచారం చేస్తున్న సమయంలో ఆయన వెంట ఉన్న సురేష్, కిషోర్‌కు మాట మాట పెరిగి వాగ్వాదం జరిగింది. అది పెరిగి ఒకరినొకరు కొట్టుకుని చొక్కాలు చింపుకునే పరిస్థితికి చేరింది. అక్కడున్న మిగతా వైసీపీ నాయకులు వీరిని విడిపించి పంపించి వేశారు. ఈ అంతర్గత వర్గ విభేదాలు సమన్వయకర్తకు తలనొప్పిగా మారుతున్నాయి.



ఏమీ చేసుకోలేరు..!



శ్రీకృష్ణపై దాడి చేసిన దుండగుల ధీమా

- అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిన వైసీపీ గూండాలు
- పట్టుకోండి చూద్దాం అంటూ పోలీసులకు దుండగుల సవాల్
- మిద్దె ఎర్రిస్వామిని అరెస్టు చేసిన రాప్తాడు పోలీసులు



రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో కూర్చున్న మిద్దె ఎర్రిస్వామి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 20: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ గుండాల్లో చాలామంది అండర్‌గ్రౌండ్‌కు వెళ్లిపోయారు. మరికొందరు స్వగ్రామాల్లోనే తిరుగుతూ.. 'మమ్మల్ని ఎవరూ ఏమీ చేసుకోలేరు..' అని బీరాలు పలుకుతున్నారు. రాప్తాడు సమీపంలో ఆదివారం జరిగిన వైసీపీ సిద్ధం సభలో వైసీపీ రౌడీమూకలు శ్రీకృష్ణపై పాశవిక దాడికి పాల్పడ్డాయి. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. జర్నలిస్టు, ప్రజా సంఘాలు, విపక్షాలు అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన కు దిగాయి. ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించాయి. ఈ నేపథ్యంలో మూ కలో కొందరు పారిపోగా.. మరి కొందరు వైసీపీ నేతల అండతో అండర్‌గ్రౌండ్‌కు వెళ్లిపోయారు. కూడేరు మండలం మరుట్ల రెండో కాలనీకి చెందిన మిద్దె ఎర్రిస్వామిని రాప్తాడు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. రౌడీల గుంపులో కీలకంగా వ్యవహరించిన మిద్దె ఎర్రిస్వామి అతని స్వగ్రామంలోనే అదుపులోకి తీసుకున్నా రు. మధ్యాహ్నం 12.20 గంటలకు రాప్తాడు పోలీస్‌స్టేషన్‌కు జీపులో తీసుకొచ్చారు. ఆ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మె ల్యే విశ్వేశ్వరరెడ్డి అనుచరులు రాప్తాడు పోలీస్ స్టేషన్ వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు పడిగాపులు కాశారు. అతన్ని తమతో బ యటకు తీసుకెళ్లేందుకు విశ్వప్రయత్నాలు చేశారు.



రాప్తాడు పోలీస్ స్టేషన్ వద్ద ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి స్టిక్కర్ ఉన్న స్కార్పియో వాహనం



పరారీలో అశోక్..



కురుబ నాగేంద్ర



అశోక్

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని దొడఘట్టకు చెందిన గొల్ల అశోక్ కోసం స్థానిక పోలీసులు మంగళవారం అతని ఇంటికెళ్లారు. అప్పటికే పరారయ్యాడు. దీంతో ఇంటి వద్ద ఉన్న అతని బైక్‌ను ట్రాక్టర్‌లోకి ఎక్కించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అశోక్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రౌడీ మూకలో మరో వ్యక్తి, కళ్యాణదుర్గం మండలం బోయలపల్లికి చెందిన కురుబ నాగేంద్ర. ఇతను అదే గ్రామంలోనే కర్ణాటక మద్యం తీసుకొచ్చి విక్రయిస్తుంటాడు. ఇతనిపై సెబ్ పోలీసులు గతంలో కేసులు నమోదు చేసినట్లు సమాచారం. దాడి చేసిన తరువాత గ్రామంలోనే ఉంటున్నాడు. మద్యం సేవించి ఊళ్లో తిరుగుతూ.. తనను ఎవరూ ఏమీ చేసుకోలేరని బీరాలు పలుకుతున్నాడని స్థానికులు అంటున్నారు. ఈ విషయం పోలీసులకు తెలుసా..? చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉన్నా..



బండి రవి

శ్రీకృష్ణపై కర్రతో దాడికి పాల్పడి, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న బండి రవి ఊరి నుంచి పారిపోయి.. బయట బయటే తిరుగుతున్నాడు. అతన్ని అదుపులోకి తీసుకునేందుకు కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి మంగళవారం పోలీసులు వెళ్లారు. ఇంటివద్ద లేక పోవడంతో ఫోన్ చేశారు. 'నేను ఊళ్లో లేను.. అనంతపురంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి ఇంటివద్ద ఉన్నా. కావాలంటే లొకేషన్ పంపుతా చూడండి..' అని పోలీసులతో అన్నట్లు సమాచారం. పోలీసులకు లొకేషన్ కూడా పంపాడని తెలిసింది. వైసీపీ రాప్తాడు నియోజకవర్గ నేతలు బండి రవికి పూర్తిస్థాయి సహకారం అందిస్తున్నారనేందుకు ఇది నిదర్శనం. ఇక టోపీ, కళ్లద్దాలు పెట్టుకుని శ్రీకృష్ణపై పిడిగుద్దులు గుద్దిన రౌడీతోపాటు దాడిలో పాల్గొన్న మరికొందరు పరారీలో ఉన్నారు.

సీరియస్‌గా తీసుకుంటారా..?

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి జరిగి మూడు రోజులు గడిచింది. దాడికి పాల్పడ్డవారు ఎవరో సామాన్యులు కూడా చెప్పగలుగుతున్నారు. 'మా ఊరివాడే.. వెధవ పనులు చేస్తుండా.. రౌడీ..' అని వాపోతున్నారు. వీడియో ఆధారాలు ఉన్నా, పోలీసులు పట్టుకోకుండా అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అందరినీ అదుపులోకి తీసుకుంటారా..? లేకే అధికార పార్టీ వారి ఒత్తిళ్లకు తలొగ్గి వదిలేస్తారా అన్న చర్చ జనంలో జరుగుతోంది. ఇప్పటి వరకూ మిద్దె ఎర్రిస్వామిని మాత్రమే అదుపులోకి తీసుకున్నారు. అశోక్ ఆచూకీ లభించలేదని అంటున్నారు. బోయలపల్లికి చెందిన నాగేంద్ర ఊరిలోనే ఉన్నాడని స్థానికులు చెబుతున్నారు. అయినా పోలీసులు అరెస్టు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రాప్తాడు నియోజకవర్గానికి చెందిన బండి రవికి అండగా ఉన్నది ఎవరో పోలీసులకు, ప్రజలకు స్పష్టంగా తెలుసు. ఎక్కడ దొరుకుతాడో కూడా తెలుసు. పట్టుకుంటారా.. వదిలేస్తారా.. తేలాల్సి ఉంది.

రేపు చలో అనంతపురం

- శ్రీకృష్ణపై వైసీపీ నేతల దాడికి నిరసనగా ర్యాలీ, ధర్నా
- జిల్లాకు రానున్న జర్నలిస్టు సంఘాల రాష్ట్ర నేతలు
- ప్రజాస్వామికవాదులు మద్దతుగా తరలిరావాలని పిలుపు
- జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టమే ప్రధాన డిమాండ్

అనంతపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసనగా జర్నలిస్టు సంఘాలు 'చలో అనంతపురం' పిలుపునిచ్చాయి. దాడికి పాల్పడ్డ వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, తక్షణమే అరెస్టు చేయాలని, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలనే డిమాండ్‌తో ఈ నెల 22న చలో అనంతపురం కార్యక్రమాన్ని నిర్వహిం చాలని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘాల రాష్ట్ర నేతలు నిర్ణయించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్దన్, రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సామ్నా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మారావు, రమణారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివ, ఫొటో జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకులు సాంబశివరావు, రాయలసీమ జిల్లాల నుంచి జర్నలిస్టులు పెద్దఎత్తున అనంతపురానికి గురువారం తరలిరానున్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని జర్నలిస్టు సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దాడులను అరికట్టాల్సిన పాలకులే దాడులను ప్రో త్సహిస్తున్నారని వారు విమర్శించారు. ఇసుక అక్రమ రవాణాపై వార్త రాసినందుకు అమరావతిలో ఈనాడు రిపోర్టర్, పుట్టపర్తిలో ఈనాడు ఫొటోగ్రాఫర్, రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అధికార వైసీపీ నేతలు దాడి చేయడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు. దాడిచేసిన వారిపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, శ్రీకృష్ణ మీద దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న అనంతపురంలో పెద్ద ఎత్తున నిర్వహించే నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు సమీప జిల్లాల జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల ఉద్యమానికి ప్రజాస్వామికవాదులు, ఉద్యోగ, ప్రజా, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాల నేతలు మద్దతివ్వాలని విన్నవించారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 20: సార్వత్రిక ఎన్నికలకు అధికారులు అన్ని విధాలా సన్నద్ధం కావాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమి ఆదేశించారు. మంగళవారం స్థానిక జేఎన్‌టీయూ ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, ఎఫ్ఎస్టీ, ఎంసీసీ టీం లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, ఎఫ్ఎస్టీ, ఎంసిసి టీంల అధికారులు కీలకంగా వ్యవహరించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన బృందాలు జిల్లా స్థాయి శిక్షణ తరువాత మార్చి మొదటి వారంలో ఆర్ఓ స్థాయిలో మరోసారి శిక్షణ ఉంటుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల సమయంలో అన్ని బృందాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల విధుల్లో ఉన్నామనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎక్కడా ఎటువంటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సివిజల్ యాప్, ఎలెక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం ఏర్పాటు తరువాత మద్యం, డబ్బు, ఇతర వస్తువులు రవాణా కాకుండా ఐటీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు మేజర్ రోల్ ప్లే చేయాలన్నారు. ఫిర్యాదులను ఆయా స్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని, ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది ఎటువంటి ప్రలోభాలకు లొంగరాదన్నారు. ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో లా అండర్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా పక్కాగా అమలు చేయాలన్నారు. సిబ్బంది శిక్షణా కార్యక్రమాలతో అవగాహన పెంచుకో వాలన్నారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు సమష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

డబుల్ ఓట్ల తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి20: ఫిర్యాదు చేసినా డబుల్ ఓట్లను తొలగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. మండలంలోని కుణుతూరు గ్రామంలోని లేని వ్యక్తి ఓట్లు రెండు చోట్ల నమోదు కావడం విశేషం. ఇటీవల డబుల్ ఓట్ల తొలగింపునకు బీఎల్‌ఓలు, పార్టీల ప్రతినిధులు ఇంటింటి సర్వే చేపట్టారు. అయినా వాటిని తొలగిం చలేదు. ధర్మవరం పట్టణం దుర్గానగర్‌కు చెందిన దుర్వాశులుకు 241పోలింగ్‌బూత్‌లో సీరియల్ నెంబర్ 960లో ఓటు ఉంది. మళ్లీ కుణుతూరు గ్రామంలో 586సీరియల్ నెంబర్‌లో దుర్వాసులు పేరుమీద ఓటు వచ్చింది. ఈ వ్యక్తి గ్రామానికి సంబంధించిన వారు కాదని, డోర్ నెంబర్‌కూడా అదేగ్రామానికి చెందిన మరోకరిది పెట్టి ఓటు జాబితాలోకి చేర్చారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పట్టణంలో ఉన్న వ్యక్తికి మా గ్రామంలో ఎలా ఓటు ఎక్కిస్తారని ఆగ్రామస్థులు బీఎల్‌ఓలను ప్రశ్నిస్తున్నారు. అధికారులకు సరైన ఆధారాలతో నివేదికలు ఇచ్చిన మళ్లీ అవే తప్పులు చేస్తున్నారని, బీఎల్‌ఓల నిర్లక్ష్యంతో డబుల్ ఓట్లు వచ్చాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నారు.

సిద్ధం సభకు వెళ్లిన వ్యక్తి ఏమయ్యాడు?

- కుటుంబ సభ్యుల ఆందోళన



హనుమంతరాయప్ప (ఫైల్)

హిందూపురం, ఫిబ్రవరి 20: మండలంలోని గోళ్లాపురానికి చెందిన హనుమంతరాయప్ప ఈనెల 18న రాప్తాడు వద్ద జరిగిన సిద్ధం సభకు వెళ్లాడు. మంగళవారం కూడా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గత ఆదివారం వైసీపీ నాయకులు హనుమంతరాయప్పను ఇంటి నుంచి సిద్ధం సభకు తీసుకెళ్లారు. ఆ రోజు రాత్రికే అతడిని తీసుకెళ్లిన వారు ఇళ్లకు చేరుకున్నారు. కానీ హనుమంతరాయప్ప మంగళవారం కూడా ఇంటికి రాకపోవడంతో ఫిర్యాదు చేయడానికి అతడి భార్య భాగ్యమ్మ, కుమారులు హిందూపురం అబ్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అతడు అదృశ్యమైంది రాప్తాడులో కాబట్టి అక్కడే ఫిర్యాదు చేయాలని అబ్‌గ్రేడ్ పోలీసులు తెలుపడంతో రాప్తాడుకు వెళ్లిన ట్లు తెలిసింది. హనుమంతరాయప్ప మూగ, చెవిటి కావడంతో... ఎక్కడైనా తప్పిపోయాడా లేక ఏమయ్యాడో అని భార్య పిల్లలు ఆందోళన వ్యక్తం చేశారు.



కదలరంతే..!



- ఏళ్ల తరబడి పాతుకుపోయిన డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు
- మూడేళ్ల నిబంధన వీళ్లకు వర్తించదు..
- అధికార పార్టీ కనుసన్నల్లోనే విధులు..



డీఆర్‌డీఏ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 20: ఆ అధికారులు ఏళ్ల తరబడి సీట్లకు అతుక్కుపోయారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మూడేళ్లు పూర్తిచేసిన అధికారులను బదిలీ చేయాలని ఈసీ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అన్ని శాఖలలో ఈ నిబంధనలు వర్తిస్తాయేమో.. డీఆర్‌డీఏ-వైకేపీ, డ్వామాలో మాత్రం వర్తించవని అందరూ చర్చించుకుంటున్నారు. ఆ ఇద్దరు అధికారులు పని చేసిన కాలం మూడున్నరేళ్ళు, నాలుగున్నరేళ్ళు అయినా వారిని కదిలించేవారు లేరు. అధికారపార్టీ నేతల కనుసన్నల్లో పని చేయడమే వారిని కదిలించకపోవడానికి కారణమని చ ర్చించుకుంటున్నారు. తమకు భజన చేసే ఉద్యోగులకు అందలం ఎక్కించడం, ప్రశ్నించే ఉద్యోగులను, దూర ప్రాంతాలకు దూరంగా బదిలీ చేసి కక్షసాధింపులకు పాల్పడుతుండడం గమనార్హం. ఈ తతంగమంతా డీఆర్‌డీఏ-వైకేపీ, డ్వామా శాఖల్లోనే జరుగుతోంది. ఇంత జరుగుతున్నా జిల్లా యంత్రాంగం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం శోచనీయం.

మూడున్నర... నాలుగున్నరేళ్లు...

డీఆర్‌డీఏ-వైకేపీ పీడీగా 2019 సెప్టెంబరు 9వ తేదీన జిల్లాకు వచ్చారు. నాలుగు సంవత్సరాల 7 నెలల కాలం పూర్తి కావస్తోంది. ఏడాదిగా హౌసింగ్‌కూ అదనపు బాధ్యతలు అప్పగించారు. సీనియర్ అధికారులు ఉన్నప్పటికీ కేవలం భజన, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సొంత జిల్లా కావడం, అదే సామాజికవర్గం కావడంతోనే బదిలీ చేయకుండా ఇక్కడే ఉంచారనే విమర్శలు లేకపోలేదు. డ్వామా పీడీ 2020 సెప్టెంబరు 14వ తేదీన జిల్లాకు వచ్చారు. అంటే మూడున్నర సంవత్సరాలు (మూడు సంవత్సరాల 7 నెలలు కావస్తోంది) అయినా ఇక్కడి నుంచి కదిలించరు. ఎందుకంటే ఈ ఇద్దరు అధికారులు అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే... మరీ ముఖ్యంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత ప్రీతిపాత్రులు కావడం, ఆయన సిఫారసుతోనే ఇక్కడ పార్టీకి మైలేజ్ పెంచేందుకు పనిచేస్తుండడం గమనార్హం.

కండువా లేకున్నా.. కార్యకర్తగా...

డీఆర్‌డీఏ-వైకేపీలో కీలక అధికారి తీరు అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. సీఎం జిల్లా పర్యటనకు వస్తే జిల్లా కలెక్టర్ తరువాత ఈ అధికారే ముందుంటారు. ఆశాఖలో అధికారులు, ఉద్యోగులు సైతం ఆశ్చర్యపోయేలా కండువా లేని కార్యకర్తలా అధికారపార్టీకి వంతు పాడడం గమనార్హం. గత నెలలో ఉరవకొండలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా పథకంలో సీఎం జగన్ దృష్టిలో పడేందుకు స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులను సభకు తరలించేందుకు ప్రత్యేకంగా డీఆర్‌డీఏ-వైకేపీ ఉద్యోగులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

సిఫారసు తప్పనిసరి..

డీఆర్‌డీఏ-వైకేపీలో ప్రతి పనికి ఓ రేటు కడుతున్నారు. లేదంటే అధికారపార్టీకి చెందిన సిఫారసు లేఖ ఉండాల్సిందే. లేదంటే ఆ పని జరగదని చర్చలు వినిపిస్తున్నాయి. బదిలీ నుంచి టెండర్లు, వర్కులు, పింఛన్లు ఇలా ఏది చేసినా రేటు, సిఫారసు లేఖ ఉంటేనే పని జరుగుతుంది. వీటిలో రెండూ లేకపోతే డీఆర్‌డీఏ-వైకేపీ కార్యాలయం మెట్లు సైతం ఎక్కడానికి అర్హత లేని పరిస్థితి. ఉద్యోగుల బదిలీల విషయంలో ఓ నియోజకవర్గానికి వెళ్ళాలన్నా ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే లేదా ఇన్‌చార్జి సిఫారసు లేఖ తేవాల్సిందేనని సూచిస్తూ అధికార పార్టీపై భక్తిని చాటుకుంటున్నారు.

పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

- అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 20: మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు పాలిసెట్-2024 దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి అర్హతగల విద్యార్థులు అర్హులని, ప్రస్తుతం పరీక్షలు రాసే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఏప్రిల్ 5వరకు https://polycetap.nic.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

రూ.8.60 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు



ఎంపికైన గౌతమి, ప్రశాంత్

కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రూ.8.60లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈఈఈ చివరి సంవత్సరం విద్యార్థి గౌతమి, ఈసీఈ చివరి సంవత్స రం ప్రశాంత్‌కుమార్ టెక్సాస్ ఇన్ స్ట్రుమెంట్ సంస్థలో ఉద్యోగాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు కళాశాలలో నిర్వహించే క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లోనే ఉద్యోగాలకు ఎంపిక అవుతారన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలించిన కలెక్టర్

తాడిపత్రి, ఫిబ్రవరి20: రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూంను కలెక్టర్ గౌతమి మంగళ వారం పరిశీలించారు. పట్టణ సమీపంలోని డిగ్రీ కళాశాలలో ఉన్న గదులను పరిశీలించి స్ట్రాంగ్ రూం అవసరమైన గదిని ఎంపికచేసి పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఎస్పీ గంగయ్య, మున్సిపల్ కమిషనర్ రవి, తహసీల్దార్ ఆంజనేయులు ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ

కూడేరు, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలతోపాటు ప్రాథమిక పాఠశాలను డీఈఓ వరలక్ష్మి తనిఖీ చేశారు. మంగళవారం తనిఖీకి వచ్చిన డీఈఓ విద్యార్థులతో విద్యా గుర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఆర్‌సీ సెంటర్‌ను తనిఖీ చేసి ఎంఈఓ-2 సాయికృష్ణతో వివరాలను అడిగి తెలుసుకున్నారు.

చిరుత దాడిలో గేదె మృతి

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 20: మండలంలోని పాల వెంకటాపురం గ్రామంలో చిరుత దాడి చేయడంతో ఓ గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన గొల్ల చిత్తప్ప అనే రైతుకు చెందిన గేదెపై సోమవారం అర్ధరాత్రి చిరుత దాడి చేసింది. గేదె మృతి చెందడంతో సుమారు రూ. 20 వేలు నష్టం కలిగినట్లు రైతు వాపోయారు. గతంలో కూడా చిరుతదాడిలో మేకలు, గేదెలు మృతి చెందాయని ఫారెస్ట్ అధికారులకు తెలియజేసినా వారు స్పందించడం లేదని పలువురు రైతులు వాపోయారు.

26న కాంగ్రెస్ బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి20: జిల్లా కేంద్రంలో ఈనెల 26న నిర్వహించే కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభను జయప్రదంచేయాలని మాజీ పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ నాయకులకు సూచించారు. మంగళవారం జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో పర్యటించి స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సభ ఏర్పాట్లపై చర్చించినట్లు తెలిపారు. సాయంత్రం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సభకు సంబంధించి చేపట్టాల్సిన అంశాలపై దిశ నిర్దేశం చేశారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు దాదాగాంధీ, జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వాసు, రవికృష్ణ రామానాయుడు, నాయకులు ఇమామ్, శర్మాస్, కొండారెడ్డి, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఓబులేసు పాల్గొన్నారు.

వైసీపీ దౌర్జన్య పాలనకు నిదర్శనం



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ధర్మవరంరూరల్ ఫిబ్రవరి 20 : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వైసీపీ రౌడీమూకలను కఠినంగా శిక్షించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కనగానపల్లి టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురంలోని పరిటాల సునీత నివాసంలో వారు మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గంలో దౌర్జన్య పాలనకు ఇది నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ముకుంద నాయుడు, కుర్లపల్లి రాజప్ప, బంగిమల్లేష్, పాల్గొన్నారు.

వైసీపీ అల్లరి మూకలను కఠినంగా శిక్షించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న మండలంలోని జర్నలిస్టులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 20: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ అల్లరి మూకలను అరెస్ట్ చేసి.. కఠినంగా శిక్షించాలని మండలంలోని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ హనుమంతునాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండలంలోని జర్నలిస్టులు శశిభూషణరెడ్డి, నారాయణస్వామి, కృష్ణ, రవికుమార్, లక్ష్మినారాయణ, పెద్దన్న, వెంకటేశు పాల్గొన్నారు.

పోలీసుల నిర్లక్ష్యమే..

అనంతపురం అర్బన్ : సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీ కృష్ణ పై దాడికి పాల్పడిన వైసీపీ మూకలపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉరవకొండలో జర్నలిస్టులపై దాడి జరిగినప్పుడు దోషులపై కఠిన చర్యలు తీసుకొని ఉంటే.. ఇప్పుడు మరో సంఘటన జరిగేది కాదన్నారు. పోలీసులు ఇప్పటికైనా స్పందించి.. దాడిచేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ సమక్షంలోనే ఈ దాడి జరగడం హేయమన్నారు. ఇందుకు సీఎం జగన్ బాధ్యత వహించాలన్నారు. రాబోవు ఎన్నికల్లో ఓటమి పాలవుతున్నామన్న భయంతో వైసీపీ గూండాలు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

పోలీసులు ఇకనైనా స్పందించాలి

అనంతపురంరూరల్ : ఆంధ్రజ్యోతి ఉద్యోగికిపై వైసీపీ అల్లరిమూకలు దాడి చేసి.. మూడు రోజులు అవుతున్నా... ఇంతవరకూ వారిని అరెస్ట్ చేయకపోవడం విడ్డూరంగా ఉందని తెలుగు రైతు రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణస్వామి అన్నారు. జర్నలిస్టులకే పోలీసులు రక్షణ కల్పించలేకపోతే.. ఇక సామాన్యులకు ఏం రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గుండాల దాడిచేయడం దారుణమని, ఇలాంటి వారి మధ్య మనం ఉన్నందుకు సిగ్గుపడాలని అన్నారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకుంటే టీడీపీ ఆధ్వర్యంలో అనంతపురం బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.

సీఎం, కలెక్టర్, ఎస్పీ బాధ్యత వహించాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్ : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి హేయమైన చర్యని పలు ప్రజా, కులసంఘాల నాయకులు ఖండించారు. వృత్తిరీత్యా శ్రీకృష్ణ సౌమ్యుడు, అందరితో చిరునవ్వుతో ఆప్యాయంగా పలుకరించేవాడన్నారు. అలాంటి వ్యక్తిమీద వైసీపీ అల్లరి మూకలు, రౌడీలు పైశాచికంగా దాడి చేయడం బాధాకరమన్నారు. ఈ ఘటనకు సీఎం జగన్మోహన్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీ పూర్తీ బాధ్యత వహించాలన్నారు.

దాడులు సరికాదు

అనంతపురం న్యూటౌన్: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరి మూకలు దాడికి పాల్పడటం దారుణమని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సరికాదని కాంగ్రెస్ రాప్తాడు నియోజకవర్గ నాయకుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. అక్రమాలు, అరాచకాలను బయటకు తెస్తున్నారనే కక్షతోనే ఫొటోగ్రాఫర్‌పై స్థానిక వైసీపీ నాయకుల అనుచరులు దాడికి దిగినట్లుగా ఉందన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

పిరికిపంద చర్య

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి పిరికిపందల చర్య అని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సాకే నరేష్ మండిపడ్డారు. విధి నిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధులపై దాడి గర్హనీయమన్నారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాడి హేయం...

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ పై దాడి హేయమైన చర్య అని ఎస్సీఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. విధి నిర్వహణలో శ్రీకృష్ణ తన పని చేయడమే తప్పా..? ఫోటోలు తీయకూడదా..? అలాంటి చట్టాలు ఏమైనా ఉన్నాయా...? అంత దాడి జరుగుతున్నా.. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం బాధాకరమన్నారు. దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలన్నారు.

పోలీసులు నిర్లక్ష్యం వీడాలి..

రామగిరి : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి జరిగి మూడు రోజులు అవుతున్నా...వైసీపీ గుండాలను పోలీసులు అరెస్ట్ చేయకపోవడం శోచనీయమని బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య అన్నారు. ఇది పోలీసుల నిర్లక్ష్యవైఖరికి నిదర్శనమన్నారు.

ఇది బీసీలపై దాడే

శింగనమల : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీ మూకలు దాడి బీసీ కులలపై దాడి చేసినట్టుగా పరిగణించాల్సి వస్తుందని రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి ఎం.ఆదినారాయణ అన్నారు. ఈ దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వైసీపీ గూండాలను అరెస్ట్ చేయాలి

నిర్భయంగా తప్పులు ఎత్తిచూపితే ఆంధ్రజ్యోతి ఉద్యోగిపై దాడి చేయడం శోచనీయమని శింగనమల మండల టీడీపీ సీనియర్ నాయకుడు పెరవలి మారుతి నాయుడు అన్నారు. వైసీపీ గూండాలను పోలీసులు కఠినంగా శిక్షించాలన్నారు.

దాడి నీచం

ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరి మూకలు దాడి నీచమని జనసేన మండల అధ్యక్షుడు తోట ఓబిలేసు మండిపడ్డారు. దాడులు చేసిన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలన్నారు.

పోలీసులు కఠినంగా వ్యవహరించాలి

ఇది వైసీపీ రౌడీమూకల దాడి.. పరికి పంద చర్య అని ఏపీ రైతు సంఘం కార్యదర్శి డి.చెన్నప్ప యాదవ్ అన్నారు. రాజకీయలు రాజకీయంగానే ఉండాలే కాని జర్నలిస్టులపై దాడి చేయడం హేమమన్నారు. ఇలాంటి సంఘనలు పునావృతం కాకుండా దాడి చేసిన వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు.

ఫొటోగ్రాఫర్ కృష్ణకు పలువురి పరామర్శ

అనంతపురం అర్బన్ / ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 20: వైసీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీ కృష్ణను మంగళవారం పలువురు పరామర్శించారు. వారిలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళీధర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, నాయకులు రమేష్, జనసేన పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు కాయగూరల లక్ష్మీపతి ఉన్నారు.

పలు సచివాలయాల్లో ఆధార్ సేవలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 20: మండలంలోని పలు ప్రాంతాల్లోని సచివాలయాల్లో ఆధార్ సేవలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పుల్లయ్య తెలిపారు. కామారుపల్లి, కందుకూరు-2, అనంతపురంరూరల్-1, రుద్రంపేట-2 సచివాలయాల్లో ఆధార్ సేవలు శుక్రవారం వరకు అందుబాటులో ఉంటాయన్నారు.

సమస్యలపై దృష్టి సారించండి

అనంత నగర పాలక సంస్థ కమిషనర్‌కు మాజీ ఎమ్మెల్యే వైకుంఠం వినతి



నగర కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రభాకర్ చౌదరి, టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 20: అనంతపురం నగరంలో తాగునీరు, పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి కోరారు. ఈ మేరకు మంగళవారం అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్‌కు వినతి పత్రాన్ని అందించారు. నెల రోజులుగా పలు డివిజన్లల్లో తాగునీరు రావడం లేదని, పారిశుధ్య నిర్వహణ లోపించడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. నగరం లో పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలువ సైడ్ వాల్స్ శిథిలం కావడంతో పరిసర ప్రాంతాల్లోని ఇళ్లల్లోని విషపురుగులు వస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. వేసవికి ముందే పీఏబీఆర్ డ్యాంలో సమ్మర్ స్టోరేజ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవళ్ల మురళీ, తలారి ఆదినారాయణ, మారుతీకుమార్ గౌడ్, సరిపూటి రమణ, నారాయణ స్వామి యాదవ్, పీఎం లక్ష్మీప్రసాద్, నటేష్ చౌదరి, గోపాల్ గౌడ్, రంగా చారి, రాజారావు, సైపుద్దీన్, మార్కెట్ మహేష్, సీసాల శీనా, ఉమమహేష్, సుభాష్ చంద్రబోస్, వన్నూరు, మనోహర్, గంగవరం బుజ్జి, జేఎం బాషా, తెలుగు మహిళలు విజయశ్రీరెడ్డి, శివబాల, సరళ, సంగా తేజస్విని, జానకి, రాధాదేవి, షరీన, జయలక్ష్మి పాల్గొన్నారు.

గుల్జార్‌పేటలో ఇంటింటి ప్రచారం

నగరంలోని 18వ డివిజన్ గుల్జార్‌పేటలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, వైసీపీ పాలనలో వైఫల్యాలను ప్రజలకు వివరించారు. తెలుగుదేశం పార్టీతోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి సాధ్యమన్నారు. టీడీపీ హయాంలో నగరంలో రూ.కోటి ఖర్చు చేసి మసీదుల నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. మైనార్టీల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ, జనసేన బలపర్చిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

విద్యాప్రమాణాల మెరుగే లక్ష్యం



నార్పల : విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారి శైల

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 20: ఉన్నత పాఠశాలల్లో విద్యాప్రమాణాల అభివృద్ధే లక్ష్యంగా లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం (లిప్)ను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర విద్యాశాఖ అకడమిక్ పర్యవేక్షణ అధికారి కల్పనాశైల తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీకేఎస్, నార్పల మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు ఆ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు వసుంధర, ఎఎస్ఎ ఏఏఎంఓ చంద్రమోహన్‌రెడ్డి, సిబ్బంది విజయ్‌కుమార్, డెవిడ్ బ్రైనార్డ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నార్పల : స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను రాష్ట్ర అకాడమిక్ మానిటరింగ్ అధికారి కల్పనాశైల తనిఖీ చేశారు. ఆమె వెంట కార్యక్రమంలో రాష్ట్ర అకాడమిక్ మానిటరింగ్ సిబ్బంది, విద్యాశాఖ అధికారులు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగ మేళా

అనంతపురం సెంట్రల్ : స్థానిక కోర్టు రోడ్డులోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిరుద్యోగులకు బుధవారం ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కళ్యాణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ సంస్థల్లో పనిచేసేందుకు ఏదేని డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వారి బయోడేటాతో మేళాకు హాజరు కావాలని కోరారు.

9న లోక్‌అదాలత్

అనంతపురం క్రైం : జాతీయ లోక్‌అదాలత్‌ను మార్చి 9న నిర్వహిస్తున్నట్లు జిల్లా జడ్జి శ్రీనివాస్, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి దీన తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తామన్నారు.

వినికిడి యంత్రాల వితరణ

అనంతపురం కల్చరల్: సక్షమ్ అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఆ శాఖ కార్యాలయంలో వినికిడి సమస్యతో బాధపడుతున్న 30 మంది చిన్నారులకు వినికిడి యంత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సక్షమ్ అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షుడు చిట్టా శ్రీధర్, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, అద్యక్షుడు సుంకు వేణుగోపాల్, డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, సక్షమ్ ప్రాంతీయ సహాయ కార్యదర్శి డాక్టర్ భానుకిరణ్, జయచంద్రారెడ్డి, కార్తీక్, సువర్ణదేవి, శీనానాయక్ పాల్గొన్నారు.

బైక్ దొంగలకు ఏడాది జైలు

అనంతపురం క్రైం: అనంతపురం నగరంలోని ప్రియాంకనగర్‌కు చెందిన సద్దాం హుస్సేన్, గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామానికి చెందిన రాజశేఖర్ బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఏడాది ద్విచక్రవాహనాలను దొంగిలించారు. దీనిపై బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ వెంకటేశ్వర్లు ఈ నిందితులపై చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారించిన అనంతరం ఆ ఇద్దరు నిందితులకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ అనంతపురం జేఎఫ్‌సీఎం స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ జె.సుజిన్ కుమార్ మంగళవారం తీర్పు వెలువరించారు.

వైసీపీపై ప్రజాపోరు సాగిస్తాం

అనంతపురం సెంట్రల్ : వైసీపీ ప్రభుత్వంపై ప్రజాపోరు సాగించనున్నట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చైతన్య కిషోర్, ఇన్‌చార్జ్ సాకే ఓబిలేసు పేర్కొన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. జగన్ ప్రజలపై అప్పుల భారాన్ని మోపుతున్నాడని ధ్వజమెత్తారు.

శేషవాహనంపై శ్రీవారు



బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 20: కొండమీదరాయుడి బ్రహోత్సవాల్లో భాగంగా నాల్గో రోజైన మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని శేషవాహనంపై రాత్రి ఊరేగించారు. మొదట స్థానిక అంజినేయస్వామి దేవాలయంలో స్వామి వారి ఉత్సవమూర్తలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పల్లకిలో ఉరేగించారు. సాయంత్రం స్థానిక లక్ష్మి నారాయణస్వామి దేవాలయంలో స్వామి వారిని రథంపై కొండ మీదరాయుడు శేషవాహనంపై ఊరేగించారు. బుధవారం స్వామి వారిని హనుమద్వాహనంపై ఊరేగిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కల్యాణమస్తు, షాదీతోఫా ప్రారంభం

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 20: వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫాలను మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ.. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా కింద 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 523 మంది లబ్ధిదారులకు రూ.3.97 కోట్లు పంపిణీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమాదేవి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదన్‌రావు, డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ రసూల్ పాల్గొన్నారు.

కార్మికుల సంఖ్య పెంచండి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 20: అనంతపురం నగరంలో కార్మికుల సంఖ్య పెంచేలా... కోవిడ్, మలేరియా, గార్బేజ్ కార్మికులకు వేతనాలిచ్చేలా ఈనెలలో జరగబోయే కౌన్సిల్ సమావేశంలో అజెండాగా చేర్చాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు వినతి పత్రం ఇచ్చారు. అలాగే సమ్మె సందర్భంగా కార్మికుల సమస్యలపై ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్ నగర కమిషనర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు.

రెండు గడ్డివాములు దగ్ధం

రాప్తాడు, ఫిబ్రవరి 20: మండలంలోని పాలచెర్లలో రైతు ఎర్రిస్వామికి చెందిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామ సమీపంలోని దొడ్డిలో గల వరిగడ్డి, వేరుశనగ గడ్డి వాములు, డ్రిప్పువైర్లకు మంగళవారం రాత్రి నిప్పు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మూడు ట్రాక్టర్లు వరిగడ్డి, మూడు ట్రాక్టర్లు వేరుశనగపొట్టు పూర్తిగా కాలిపోయాయి. ఫైర్ ఇంజన్ వాహనం వచ్చి మంటల ఆర్పివేశారు. దాదాపు ఒకటిన్నర లక్ష నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

ఉత్సాహంగా యూత్ పార్లమెంట్

అనంతపురం క్లాక్‌టవర్ : స్థానిక నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌ను ఆన్‌లైన్‌లో మంగళవారం నిర్వహించారు. రాయలసీమ జిల్లాలో అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి వర్చువల్‌గా యువత పాల్గొన్నారు. ఇందులో 160మంది పాల్గొనగా 16మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు అధికారులు ఎంపిక చేశారు.

ఘనంగా బీసీల ఆత్మీయ సమావేశం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 20: స్థానిక జిల్లా పరిషత్‌లో బీసీల ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జడ్పీ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు మాట్లాడుతూ... బీసీల రాజ్యాధికారమే బీసీ సంక్షేమ సంఘం అంతిమ లక్ష్యమన్నారు. బీసీలు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలన్న ఉద్దేశంతోనే రాష్ట్రవ్యాప్తంగా బీసీల ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రం, రాష్ట్రంలో బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని, బీసీలను ఎదగనివ్వకుండా చూస్తున్నాయని అన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ నాగభూషణం, బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రమేష్ గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్వారకా శీను, బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సంపంగి గోవర్ధన్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత నాగరాజు, సంఘం జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర, గౌడ సంఘం సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



శంకర్‌రావును సన్మానిస్తున్న నాయకులు

28న 'చలో ఢిల్లీ'

అనంతపురం విద్య, ఫిబ్రవరి 20: ప్రభుత్వం రంగంలో ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని, ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఏ, ఏఐఎస్‌బీ, ఎన్ఎస్‌యూఐ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను నగరంలోని ఆర్ట్స్ కాలేజీలో మంగళవారం ఆవిష్కరించిన ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి అబ్దుల్ ఆలం, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పృధ్వీ, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఓబు లేసు మాట్లాడారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న, అట్టడుగు వర్గాల విద్యార్థులకు ఫెలోషిప్ ఇవ్వాలని, నిరుద్యోగ భృతి కల్పించాలని, రిజర్వేషన్ల పరిధిని విస్తరించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. మహిళలు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. అన్ని యూనివర్సిటీలు, కాలేజీల్లో స్టూడెంట్ ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు ప్రతిభా భారతి, సుమ, షామీర్, నరసింహ, వలి, రఫీ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనుమతుల్లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ధర్నా

అనంతపురం విద్య, ఫిబ్రవరి 20: జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య నాయకులు డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్ మాట్లాడారు. విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకపోయినా కొన్ని కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్లకు శ్రీకారం చుట్టాయన్నారు. అడ్మిషన్లు చేస్తున్న సదరు స్కూళ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, నగర అధ్యక్షులు మంజునాథ్, కార్యదర్శి ఉమామహేష్, ఇతర నాయకులు హరికృష్ణ, నారాయణస్వామి, పవన్, వంశీ, ఆనంద్, ప్రసన్న, సునీల్, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్దు, భీమేష్, సోము, వీరు, మతేష్, నరసింహ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

హామీల అమలు.. పచ్చి అబద్ధం



మాట్లాడుతున్న కుంటిమద్ది రంగయ్య

రామగిరి, ఫిబ్రవరి 20: ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని రాప్తాడు సిద్ధం సభలో సీఎం జగన్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడారని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్ విమర్శించారు. సిద్ధం సభను.. మద్యం సభగా మార్చారని ధ్వజమెత్తారు. మంగళవారం సాయంత్రం మండలంలోని శ్రీహరిపురంలో వారు మీడియాతో మాట్లాడారు. నవరత్నాల పేరుతో నవమోసాలు చేశారని మండిపడ్డారు. అన్న క్యాంటీన్, చంద్రన్న బీమా తదితర 130 సంక్షేమ పథకాలు రద్దు చేసిన మహాఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. ధరలు, పన్నులు, చార్జీలు, అప్పుల బాదుడుతో ఒక్కో కుటుంబంపై పెనుభారం మోపారన్నారు. తన చుట్టూ మాఫియా లీడర్లను పెట్టుకుని పరిపాలన సాగిస్తూ.. రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని ప్రగల్భాలు పలుకుతూ అబద్ధాలతో సీఎం విలువనే దిగజార్చుతున్నారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు మజ్జిగ అశోక్‌కుమార్, నాగేంద్ర, కమతం కిష్టప్ప, మల్లెల ఆంజనేయులు, కుళ్లాయప్ప, తిరుపాలు, ఈశ్వరయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి ఓటమే లక్ష్యం



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

శింగనమల, ఫిబ్రవరి 20: వచ్చే ఎన్నికలల్లో జగన్‌రెడ్డి ఇంటికి పంపడమే ధ్యేయంగా సర్పంచులు నిర్ణయించుకున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యనిర్వహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం విజయ వాడలోని బాలోత్సవం భవన్‌లో జాతీయ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీపీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర సర్పంచులు, పంచాయతీరాజ్ చాంబర్ సభ్యుల సమావేశంలో డేగల కృష్ణమూర్తి మాట్లాడారు. రాష్ట్రంలో 12,918 గ్రామాల్లోని 3.50 కోట్ల మంది గ్రామీణులను సీఎం జగన్‌రెడ్డి మోసం చేశాడని విమర్శించారు. మూడు సంవత్సరాల నుంచి పంచాయతీల అభివృద్ధి కుంటుపడానికి, సర్పంచు వ్యవస్థ నాశనం కావడానికి జగన్ ప్రభుత్వమే కారణమన్నారు. దీన్ని నిరసిస్తూ శనివారం ప్రతి కలెక్టట్ ఎదురుగా నిరాహార దీక్షలు చేస్తామన్నారు.

తాగునీటి సమస్య పట్టని పాలకులు



బిందెల కాలనీలో తాగునీరు అందిస్తున్న గౌస్‌మొద్దీన్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 20: అనంతపురం నగరంలో తాగునీటి సమస్యలను తీర్చలేని దుస్థితిలో పాలకులు ఉన్నారని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ మండిపడ్డారు. మంగళవారం స్థానిక గుత్తి రోడ్డులోని బిందెల కాలనీలో ట్యాంకర్ల ద్వారా ఉచితంగా తాగునీటిని సరఫరా చేసిన ఆయన మాట్లాడారు. 20 రోజుల్లో నగరంలో తాగునీటి సమస్యల తలెత్తినా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. అనంతపురం అర్బన్ పరిధిలో ఎక్కడ తాగునీటి సమస్య ఉన్నా 91001 48644 సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, తక్షణమే ఆయా ప్రాంతాలకు తాగునీరు ఉచితంగా సరఫరా చేస్తామన్నారు.

జగన్ హామీలను ఇక నమ్మరు : జనసేన



సమస్యలపై ఆరా తీస్తున్న పెండ్యాల శ్రీలత

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 20: అమలు చేయలేని హామీలిచ్చి గద్దెనెక్కిన సీఎం జగన్మోహన్‌రెడ్డి - ప్రస్తుతం ఇస్తున్న హామీలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత విమర్శించారు. మంగళవారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా 5వ డివిజన్‌లోని శ్రీనివాసనగర్‌లో పర్యటించి స్థానిక మహిళలతో సమస్యలపై ఆరా తీశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, జనసేన, టీడీపీలకు ఓటు వేసి నూతన ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు.

చిత్రకళ పోటీల్లో పేరూరు విద్యార్థి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న నవదీప్

రామగిరి, ఫిబ్రవరి 20: మండలంలోని పేరూరు గురు కుల పాఠశాలలో ఏడో తర గతి చదువుతున్న నవదీప్ చిత్రకళా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచారు. గత ఏడాది చిక్కీ సంస్థ ట్రూగుడ్ లోగో చిత్రీకరణ పోటీలను రెండు తెలుగు రాష్ట్రాలకు సంయుక్తంగా నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా నవదీప్ మూడో స్థానంలో నిలిచారు. మంగళవారం రాజమండ్రిలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి వేణుగోపాలక్రిష్ణ.. నవదీప్‌కు రూ.27వేలు విలువ చేసే ట్యాబ్‌ను అందజేశారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి దుర్మార్గం

నినదించిన జర్నలిస్టులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు

పలు చోట్ల ఆందోళన, నిరసన ర్యాలీలు



కళ్యాణదుర్గంలో జర్నలిస్టు సంఘం ర్యాలీ

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 20: మీడియాపై దాడులు ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదమని ఏపీయూడబ్ల్యూజే కళ్యాణదుర్గం శాఖ పేర్కొంది. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని మంగళవారం యూనియన్ నాయకులు ఖండించారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి టీ సర్కిల్ మీదుగా గాంధీచౌక్ వెళ్లి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. అక్కడి నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం చేరుకుని అధికారికి వినతి పత్రం అందించారు. అలాగే పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేసి నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విలేఖరులు నిర్వహించిన ర్యాలీకి జనసేన విద్యార్థి సంఘ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు టీవీ 5 రవి, ప్రధాన కార్యదర్శి, ఆంధ్రజ్యోతి ఇన్‌చార్జ్ కృష్ణ, ఉపాధ్యక్షుడు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఇన్‌చార్జ్ హరినాథ్, ఉపాధ్యక్షుడు టెన్ టీవీ నరసింహులు, బిగ్ టీవీ ఇషాక్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగా ప్రసాద్, తిప్పేస్వామి, మల్లికార్జున, ఈసీ మెంబర్లు నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన విలేకరులు, సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు అచ్యుత్ ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, జనసేన నాయకులు బాల్యం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

హేయమైన చర్య: దళిత, గిరిజన సంఘాల నాయకులు

విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడి హేయమైన చర్య అని దళిత గిరిజన సంఘాల నాయకులు ఆర్‌కే రాజు, ధనుంజయనాయక్ అన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిందితులను గుర్తించి హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత గిరిజన సంఘాల నాయకులు తిప్పేస్వామి నాయక్, జై భీమ్ సంరక్షణ సమితి అధ్యక్షులు విలియమ్స్, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే గురుమూర్తి, న్యాయవాది అలెగ్జాండర్, సీనియర్ నాయకులు కుళ్లాయప్ప, యర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అమానుషం

గుత్తి: జర్నలిస్టులపై దాడులను నిరసిస్తూ సీపీఐ, సీపీఎం, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ సర్కిల్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాప్తాడులో సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణ, టీవీ5 రిపోర్టర్ అనిల్‌పై దాడి చేయడం ప్రజా స్వామ్యానికి సిగ్గుచేటన్నారు కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, పట్టణ కార్యదర్శి రాజు, నాయకులు సాయి, రమేష్, కేవీపీఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున, సీపీఎం నాయకురాలు రేణుక, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు వీరన్న, ఆటో యూనియన్ నాయకులు రామాంజినేయులు, సీపీఐ సీనియర్ నాయకులు అశోక్, మాబు పాల్గొన్నారు.

యాడికి: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ, టీవీ-5 జర్నలిస్టు అనిల్‌పై దాడిచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ యాడికి మండల జర్నలిస్టులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులపై జరిగిన దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో జర్నలిస్టులు షణ్ముఖరెడ్డి, ఫరూక్, జోగిరెడ్డి, రాయుడు, లక్ష్మీనారాయణ, హేమాద్రి నాయుడు, చంద్రశేఖర్, బాలకృష్ణ, రహంతుల్లా, నారాయణస్వామి, రవి, శర్మాస్ తదితరులు ఉన్నారు.



గుత్తిలో ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

బెళుగుప్ప: వైసీపీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అల్లరి మూకల దాడి అమానుషమని జనసేన నాయకులు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేయాలని కోరుతూ మంగళవారం వారు ఏఎస్ఐ దేవదాసుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కాసంశెట్టి సుధీర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కణేకల్లు: ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై వైసీపీ నాయకులు దాడి చేయడం హేయమని జిల్లా ప్రగతిశీల విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ పేర్కొన్నారు. జర్నలిస్టుపై దాడికి దిగిన వారిని గుర్తించి హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రాయదుర్గం: వైసీపీ సిద్ధం కార్యక్రమం కవరేజ్‌కు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై దాడి అమానుషమని వాల్మీకి సేవా సమితి అధ్యక్షులు బండి కిష్టప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవనోపాధి కోసం వృత్తిలో కొనసాగుతున్న విలేకరులపై దాడిని కులమత రాజకీయాల పార్టీలకతీతంగా ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విలేకరిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయక్



యాడికిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు



బెళుగుప్పలో ఏఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

శేషవాహనంపై దర్శనమిచ్చిన రంగనాథుడు

గుత్తిరూరల్ ఫిబ్రవరి 20: మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేతుడై శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని వేకువజామున వివిధ పుష్పాలతో సర్వాంగ సుదరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకి లో కొలువుదీర్చి, గ్రామవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. అనంతరం చిన్న రథంపై కొలువుదీర్చి భక్తులు జమ్మిచెట్టు వరకు లాగారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ దేవదాసు ఆలయ అర్చకులు, చేతన్ వర్మ, రవి స్వామి, లికిల్ వర్మ, ఉదయ్, నవిన్ సిబ్బంది పాల్గొన్నారు.



అలంకరణలో దేవేరులతో స్వామి వారు

సిద్ధం పేరుతో ప్రజలపై యుద్ధం: జేసీపీఆర్



మహిళలతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పెద్దపప్పూరు, ఫిబ్రవరి20: సిద్ధం పేరుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలపై యుద్ధం ప్రకటిస్తున్నారని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో ఆయన చేపట్టిన యువచైతన్య బస్సుయాత్ర ముగింపు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌ను ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మూడురోజుల క్రితం రాప్తాడులో జరిగిన సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను విచక్షణారహితంగా చితకబాదడం దారుణమన్నారు. మీడియాలో పనిచేసేవారికే దిక్కులేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. తనమీద కూడా కేసులు పెట్టారని ఇంతవరకూ న్యాయం జరగలేదన్నారు. సిద్ధంకు వ్యతిరేకంగా తాను యువచైతన్య బస్సుయాత్రను ప్రారంభించానని జేసీపీఆర్ తెలిపారు. ఆయన వెంట జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, బీసీ రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, కన్వీనర్ గుర్రి రఘునాయుడు, శివశంకర్‌రెడ్డి, రంగస్వామి, సత్యనారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీలో నియామకం

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 20: అనంతపురం పార్లమెంటరీ టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధిగా మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన సత్యప్ప గారి వెంకటేశులును నియమించినట్లు తెలుగుదేశం పార్టీ అధికారికంగా ప్రకటించినది.చాలా ఏళ్లగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వెంకటేశులును పదవికి ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం అవుతోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు రోజులలో మ రింత బాధ్యతగా పార్టీకి సేవలందించి అధికారంలోకి తేవడం కృషి చేస్తానని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 20: జిల్లా స్పెషల్ పార్టీ సిబ్బంది, కంబదూరు పోలీసులు ఎస్ఐ అంజనేయులు ఆధ్వర్యంలో కర్తనపర్తి క్రాస్ వద్ద మంగళవారం కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో ఐదుగురు వ్యక్తులు వచ్చారు. పోలీసుల తనిఖీలను గుర్తించి వారిలో నలుగురు పరారయ్యారు. తిప్పేపల్లికి చెందిన అనిల్ పట్టుబడ్డాడు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన 20 మద్యం బాక్సులు సీజ్ చేశారు. మొత్తం 1872 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు ఉన్నాయి. కారుసహా వీటిని స్వాధీనం చేసుకున్నారు. పరారైన నలుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సూపర్ సిక్స్‌తో మీ భవిష్యత్తు గ్యారెంటీ

- ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

బెళుగుప్ప, ఫిబ్రవరి 20: టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో మీ భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని దుద్దేకుంటలో మంగళవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానిక ఎస్సీ కాలనీవాసులు హారతులతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ఈ కార్యక్రమం గురించి వివరించారు. 50 రోజులు ఆగితే అధికారం మనదే పార్టీకి అండగా వుండండి మీ భవిష్యత్తుకు గ్యారెంటీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, తిమ్మప్ప, పెద్ద తిప్పయ్య, మల్లికార్జున, సర్పంచ్ రాము, ప్రసాద్, విరుపాపల్లి రాధాకృష్ణ, వెంకటేశులు, ఆవులెన్న యర్రిస్వామి, వెంకటస్వామి, శీర్పి, వెంకటేశులు, జయరాములు, నారాయణస్వామి, రామసాగరం, యర్రిస్వామి, నారాయణస్వామి, శంకరప్ప, శ్రీనాథ్, రాము, శ్రీనివాసులు, ప్రతాప్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, కంచిరాముడు, శశి భూషణ్ చౌదరి, వీరాంజి తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తు గ్యారెంటీ గురించి వివరిస్తున్న పయ్యావుల కేశవ్

క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలి: కాలవ

కణేకల్లు, ఫిబ్రవరి 20: క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా తీసుకుని ముందుకు వెళ్లాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు ఆయన మంగళవారం బహుమతులు అందజేసి మాట్లాడారు. విజేతగా నిలిచిన బ్రహ్మసముద్రం జట్టుకు రన్నరప్‌గా నిలిచిన కణేకల్లు షేక్‌ముజ్జు టీంకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ లాలెప్ప, ఉండాల హనుమంతరెడ్డి, ఆనంద్‌రాజ్, కోళకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, మారుతి, కురుబ నాగరాజు, చిన్న సలీం, చాంద్ బాషా, రామప్ప, రఘు, జయశీలా రెడ్డి, గిరిగౌడ్ పాల్గొన్నారు.

● మండలంలోని జక్కలవడికి గ్రామానికి చెందిన వైసీపీ వార్డు మెంబర్ గంగప్ప, మహేష్, చిట్లంపల్లి నాగేష్ ఆధ్వర్యంలో దాదాపు 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మంగళవారం జక్కలవడికిలో జరిగిన వన్నూరుస్వామితాత ఉరుసు ఉత్సవాలకు హాజరైన కాలవ శ్రీనివాసులు సమక్షంలో వీరు పార్టీలో చేరారు.



క్రీడాకారులకు కప్‌ను అందజేస్తున్న మాజీ మంత్రి కాలవ

పాలన చేతగాని జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టండి

- మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు

గుంతకల్లు, ఫిబ్రవరి 20: పరిపాలన చేతగాని జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని 13వ వార్డు పార్టీ ఇన్‌చార్జి, కౌన్సిలరు కేసీ అనురాధ నేతృత్వంలో టీడీపీ నాయకులు భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జితేంద్ర గౌడు వార్డు ప్రజలకు కరపత్రాలను పంచి సూపర్ సిక్స్ పథకా లను వివరించారు. సంక్షేమ కార్యక్రమాలతోపాటు గ్రామ పట్టణాభివృద్ధి కార్యక్రమాన్ని కూడా చంద్రబాబునాయుడు సమపాళ్లలో నిర్వహిస్తారన్నారు. జగన్ చెత్తపై పన్ను వేస్తే, చంద్రబాబు చెత్తతో సంపదను సృష్టించారన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్‌గౌడు, నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, అనిల్‌కుమార్‌గౌడు, తలారి మస్తానప్ప, టీ కేశప్ప, హనుమంతు, శివప్ప, రంజాన్, ఫజులు, ఫ్రూట్ మస్తాన్, రాయల్ వెంకటేశ్, రామన్న చౌదరి, జగన్నాథ్, పులికొండ, భగవంతప్ప, మహదేవ్, భాస్కర్, మౌనిత, నీలిమ దేవి, దేవి, దీప్తి, నాగరత్న, శివ మ్మ, పుల్లమ్మ, కావ్య, దేవి, జయ, మణి, ఈశ్వర్, మల్లేశ్, శివ, పాల్గొన్నారు.

పామిడి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి ప్రదాత అని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ పేర్కొన్నారు. ఇటీవల రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో చంద్రబాబునాయుడు ఏమి చేశాడని సీఎం వైఎస్ జగన్ మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. పామిడి నుంచి కట్టకిందపల్లి గ్రామం (నియోజకవర్గ పరిధి)వరకూ రూ.26 కోట్లతో టీడీపీ పాలనలోనే డబుల్ రోడ్డు నిర్మాణం చేశామన్నారు. చంద్రబాబునాయుడు అనగానే అభివృద్ధి గుర్తుకు వస్తుందన్నారు. ఇకనైనా అబద్ధపు హామీలు, మాటలు మానుకోవాలని హితవు పలికారు.



ప్రచారం నిర్వహిస్తున్న జితేంద్రగౌడు

టీడీపీ మైనార్టీ పట్టణ కమిటీ ఏర్పాటు

రాయదుర్గం, ఫిబ్రవరి 20: తెలుగుదేశం పార్టీ పట్టణ మైనార్టీ అధ్యక్షుడుగా పకీర్‌జావిద్‌ను నియమిస్తున్నట్లు మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన పట్టణ మైనార్టీ సెల్ కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా చౌదరిషఫీ, కే అహమ్మద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా మహల్దర్‌నిసార్‌లను నియమించారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా షేక్ ఇస్మాయిల్, పుంగనూరు ఇబ్రహీం, పకీర్ జక్రియలు ఉన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు కడ్డిపుడి మహబూబ్‌బాషా, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు జమీల్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి ఇనాయత్ బాషా, మారెంపల్లి ఉస్మాన్, ఘోర ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

గుత్తి, ఫిబ్రవరి 20: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఓసీసీఐ నేషనల్ చీఫ్ అడ్వైజర్ గుంజుల నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో వడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డె ఓబన్న జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. అదే రీతినా ఏపీ ప్రభుత్వం అధికారకంగా నిర్వహించాలన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఓసీసీఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీదేవమ్మ, నాయకులు వరదరాజులు, హరి, దస్తగిరి, వీరప్ప, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో డాబా దగ్ధం

బెళుగుప్ప, ఫిబ్రవరి 20: మడలంలోని గుండ్లపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిలో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో డాబా కాలిపోయింది. దీంతో రూ. 4 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితుడు రామాంజనేయులు కొన్ని నెలలుగా ఇక్కడ డాబా వేసుకుని జీవనం సాగిస్తున్నారు. అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. డాబాలోని వంటసామాగ్రి కాలిపోయింది. కుమారుడి పెళ్లి కోసం స్వయం సహాయక సంఘాల్లో అప్పుగా తెచ్చిన రూ. రెండు లక్షలు బీరువాలో ఉంచుకున్నారు. ఇది కూడా కాలి బూడిదైంది.

కొత్తూరులో చెరుకుతోట దగ్ధం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 20: మండలంలోని కొత్తూరు గ్రామ శివారులో మంగళవారం ప్రమాదవశాత్తు చెరుకుతోట అగ్నికి ఆహుతైంది. బాధితులు, గ్రామస్థుల కథనం మేరకు కొత్తూరు గ్రామానికి చెందిన మచ్చన్న ఆరు ఎకరాల్లో చెరుకు పంట సాగు చేశారు. రెండు ఎకరాల్లో చెరుకు పంట గానుగ పూర్తి చేశారు. మిగిలిన నాలుగు ఎకరాల్లో చెరుకుతోటకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే మచ్చన్న కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. స్థానికులు, బాధితులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. చెరుకుతోట దగ్ధం వల్ల రూ. ఐదు లక్షల నష్టం వాటిలినట్లు బాధిత రైతు పేర్కొన్నారు.

గుజిరి దుకాణంలో...

కుందుర్పి: స్థానిక మార్కెట్ సమీపంలో ఉన్న నూరుల్లా గుజిరి దుకాణంలో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు కేకలు వేశారు. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటనను పరిశీలించారు. ఈ మంటల్లో దాదాపుగా రూ. లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు గుజిరి దుకాణం యజమాని నూరుల్లా తెలిపారు.

26న అనంతకు కాంగ్రెస్ చీఫ్ ఖర్గే రాక



ఉరవకొండలో మాట్లాడుతున్న శైలజనాథ్

రాయదుర్గం/గుంతకల్లు టౌన్/ఉరవకొండ, ఫిబ్రవరి 20: ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈనెల 26న అనంతపురం రానున్నట్లు మాజీమంత్రి శైలజానాథ్ తెలిపారు. మంగళవారం ఆయన రాయదుర్గంతో పాటు గుంతకల్లు, ఉరవకొండ పట్టణాల్లో పర్యటించి, విలేకరులతో మాట్లాడారు. అనంతపురంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించేందుకు ఖర్గే, షర్మిలతో పాటు రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాకూర్ అనంతపురం వస్తున్నట్లు వెల్లడించారు. వారిరాకను పురస్కరించుకుని ఏర్పాటు చేసే సభను విజయవంతం చేయడానికి నియోజకవర్గాల్లో తిరుగుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జిలు దౌల్తాపురం ప్రభాకర్, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల కోసం నిరీక్షణ

ఉరవకొండ,ఫిబ్రవరి20: జగనన్న ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు పట్టాల రిజిస్ట్రేషన్ కోసం గంట తరబడి నిరీక్షిస్తున్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశభవనంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ను అధికారులు నిర్వహిస్తున్నారు. పట్టా లు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు లబ్ధిదారులు ఉదయం 7గంటలకు కా ర్యాలయం వద్దకు వస్తున్నారు. 10గంట లకు ప్రక్రియను ప్రారంభిస్తున్నారు. మంగ ళవారం సుమారుగా 400మంది దాకా లబ్ధిదారులు వచ్చారు. వారికి కనీసం సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయలేదు. అంతమందికి కేవలం ఒకే షామియానా ఏర్పాటు చేశారు. మిగిలిన వారు చెట్ల కింద ఎండలోనూ ఎదురు చూశారు. సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో ఆలస్యమవు తోంది.లబ్ధిదారులు రెండు సార్లు బయోమెట్రిక్ ఉండటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమవుతోంది.

వివాహిత అదృశ్యం

పుట్లూరు, ఫిబ్రవరి20: మండలంలోని శనగలగూడూరు గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. ఉదయం నుంచి గ్రామంలో కనిపించక పోవడంతో బంధువుల ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులు విచారించారు. అయినా కనబడకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గుంతకల్లుటౌన్,ఫిబ్రవరి20: పట్టణంలోని రోటరీ క్లబ్ వెనుక ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య మంగళవారం తెలిపారు. పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.3420లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.